క్లుప్తంగా

సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

వేల్పూర్: సార్వత్రిక సమ్మె పోస్టర్లను వేల్పూర్ మండలం లక్కోరలో టీయూసీఐ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు అరవింద్, బీడీ ప్యాకర్స్ కార్మికులు పాల్గొన్నారు.

కోటగిరి, పొతంగల్‌లలో..



కోటగిరిలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రుద్రూర్: సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ జిల్లా నాయకులు విఠల్ గౌడ్, నల్ల గంగాధర్ పిలుపు నిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వ పాలనలో అన్ని వస్తువులు ధరలు పెరుగుతున్నాయే తప్పా కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ నాయకులు దుబాస్ సాయిలు, వీరేశం, రాజు, గోపి, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ..

కోటగిరి మండల కేంద్రంలో సీఐటీయు నాయకులు గురువారం దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసి, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సీఐటీయూ నాయకులు లింగం, గంగవ్వ, బాలమణి, లక్ష్మి, లింగవ్వ తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



పొతంగల్‌లో సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ కార్మికులు

రుద్రూర్: సార్వత్రిక సమ్మె సందర్భంగా గురువారం పొతంగల్ మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్మికులు జూనియర్ అసిస్టెంట్ గంగాధర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు అర్జున్, సభ్యులు నగేష్, సునీత ఆయా జీపీల కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం



వేల్పూర్‌లో ఇంటి నిర్మాణం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులు

వేల్పూర్: వేల్పూర్, మోతె గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో బాలకిషన్, కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. 407 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు. లబ్ధిదారులు వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని చెప్పారు. ఇంటి నిర్మాణం విషయంలో ఎటువంటి అనుమానాలున్నా స్థానిక జీపీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు రాజేందర్, రమణ, రాజేశ్వర్, గంగయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండగ



బోనాలతో మహిళలు

ఎడపల్లి(బోధన్): జైతాపూర్‌లో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనమెత్తిన గ్రామ మహిళలు డప్పు వాయిద్యాల నడుమ పెద్దమ్మ ఆలయానికి చేరుకొని బోనం సమర్పించి, మొక్కును తీర్చుకున్నారు. గ్రామంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.

సతమతమవుతున్న సజ్జ రైతు

- అకాల వర్షాలతో పంటను ఆరబెట్టుకోడానికి ఇబ్బందులు
- మంచి ధర ఉండటంతో అధికంగా పంట సాగు



రెంజర్లలో ఆరబెట్టిన సజ్జ కంకులు

బాల్కొండ : వారం రోజుల నుంచి అకాల వర్షాలు కురువడంతో సజ్జ రైతులు సతమతమవుతున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో సజ్జ పంట పూర్తిగా తడిసిముద్దయింది. ప్రస్తుత సంవత్సరం సజ్జ పంటకు మంచి ధర ఉండటంతో రైతులు అధికంగా సజ్జ పంటను సాగు చేశారు. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతున్నాయి. కానీ నిత్యం వర్షాలు కురుస్తుండటంతో సజ్జ రైతుల కంటి మీద కునుకు లేకుండా పోతోంది. సజ్జ పంటను కంకులు కోత కోసి ఆరబెట్టి హార్వెస్టర్‌తో నూర్పిడి చేస్తారు. ప్రస్తుతం కోతలు కోసి కల్లాల్లో సజ్జ కంకులను ఆరబెట్టారు. నిత్యం వర్షం కురుస్తుండటం వల్ల కంకులు ఎండటం లేదు. ఈ ఏడాది సజ్జ పంట క్వింటాల్‌కు రూ.6,200 నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు. వ్యాపారులతో ముందస్తుగానే ఒప్పందం చేసుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే క్వింటాల్‌కు రూ.2 వేల ధర తగ్గింది. దానికి తోడు నిత్యం వర్షాలు వెంటాడుతున్నాయి.

నువ్వు రైతులకు తప్పని తిప్పలు..

నువ్వు పంట సాగు చేసిన రైతులకు కూడా వర్షం తిప్పలు తప్పడం లేదు. అకాలంగా వర్షాలు కురుస్తుండటంతో ఆరబెట్టిన నువ్వుల పంట నీటి పాలవుతోంది. నువ్వు పంటకు ఈ ఏడాది మంచి ధర ఉందని రైతులు ఆనంద పడేలోపే వర్షం రూపంలో ఆనందం ఆవిరి ఆవుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వానలతో తిప్పలైతుంది..



పంట ఆరకుండా నిత్యం వర్షం కురుస్తోంది. సజ్జ కంకులు మొత్తం తడిసి ముద్ద వుతున్నాయి. హార్వెస్టర్‌తో నూర్పిడి చేసినా విత్తులు పూర్తిగా వచ్చేలా కనిపించడం లేదు. సజ్జలో ఎక్కువగా పొట్టు ఉండటం వల్ల త్వరగా ఎండటం లేదు. తీవ్ర ఇబ్బంది అవుతుంది.

– రిక్కల గంగారెడ్డి, రైతు, రెంజర్ల

నాణ్యత లోపిస్తే శాఖా పరమైన చర్యలు

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



సిద్ధాపూర్‌లో రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

వర్ని : అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి.. అధికారులు, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. వర్ని మండలం సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను, జాకోరాలో లిఫ్ట్ ఇరిగేషన్, సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, చూసీ చూడనట్టు వ్యవహరిస్తే నాణ్యత లోపిస్తుందని బాధ్యతగా విధులు నిర్వహించి నాణ్యత ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రిజర్వాయర్, లిఫ్ట్, సబ్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే రైతులకు సకాలంలో సాగునీరు అందించగలుగుతామని అన్నారు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలో సాగునీటి కొరత తీర్చడానికి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాస్, వర్ని మాజీ జెడ్పీటీసీ హరిదాసు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కొట్లాడుతాం



బోధన్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే వరకు బల్దియా అధికారులతో కొట్లాడుతామని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీని నాయకులు వెల్లడించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా రాజుల దేవి పవన్‌కుమార్, మిర్జాపురం అర్విండ్, ఉపాధ్యక్షులుగా యోగిరాజ్ వైద్య, రవీందర్, గౌడుగు దివ్య, గాదె సందీప్, కార్యదర్శులుగా నిమ్మ శ్రీనివాస్, గంగుల శ్రీకాంత్, పుటాన్కర్ భార్గవి, శివరాజ్, కోశాధికారిగా పప్పుల స్వర్ణలత, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని, బాధ్యతాయుతంగా పనిచేసి కౌన్సిలర్ సీట్లు గెలుస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపి కిషన్, నాయకులు గౌడుగు ధర్మపురి, గౌతం గౌడ్, కందికట్ల శ్రీనివాస్ గౌడ్, ఏషా సురేందర్, గుంత గంగాధర్, లోకేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకుందాం



సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతి పత్రం అందజేస్తున్న ఎంఐఎం నాయకులు

బోధన్‌టౌన్(బోధన్) : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను అందరం ప్రశాంతంగా జరుపుకుందామని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ కోరారు. గురువారం ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు, పట్టణ సీఐ వెంకట నారాయణకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ.. రానున్న బక్రీద్ పండుగ కోసం అనుమతితో ఎద్దులను తరలిస్తున్నా కొంత మంది వాహనాలను అడ్డుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

క్రీడలతో పాటు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలి



రుద్రూర్: యువత క్రీడలతో పాటు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సామాజిక సేవా కార్యకర్త ఎంఏ హకీం అన్నారు. పొతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదీ యువకులకు గురువారం ఆయన క్రికెట్ కిట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. హంగర్గ ఫారం మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, నాయకులు షేరు, రాములు తదితరులున్నారు.

అఖండ శివనామ సప్తాహం



భజన చేస్తున్న కళాకారులు, మహిళలు

బోధన్: వీరశైవ లింగాయత్ సమాజ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో సాలూర మండలంలోని మందర్న గ్రామ కాశీ విశ్వనాథ్ మందిరంలో ఏర్పాటు చేసిన 17వ అఖండ శివనామ సప్తాహం గురువారం మూడో రోజు కొనసాగింది. ఈ నెల 13న ప్రారంభమైన సప్తాహం 20 వరకు కొనసాగనుంది. సప్తాహం శిబిరంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగించారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలను అందజేస్తున్న మల్కారెడ్డి, అధికారులు

ఎడపల్లి(బోధన్): యాభై శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎడపల్లి సొసైటీలో చైర్మన్ పోల మల్కా రెడ్డి , వ్యవసాయ శాఖ మండల అధికారి సిద్ధిరామేశ్వర్లు జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోల మల్కారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఎడపల్లి సొసైటీలో 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బొబ్బిలి శ్రీనివాస్, చేపూరి కిషోర్, రైతులు బంజ కామప్ప, నాయుడు పోతున్న, శ్రీనివాస్ గౌడ్, సొసైటీ సీఈవో రాజారాం తదితరులు ఉన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కోటగిరిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రావు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రుద్రూర్: విద్యార్థులు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి మండల విద్యాధికారి నాదెండ్ల శ్రీనివాస్ రావు అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాంపులో విద్యార్థులకు డ్యాన్స్, యోగ, డ్రాయింగ్, కరాటేలో శిక్షణ ఇస్తారని వివరించారు.

వేసవి సమయం వృథా కాకుండా విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నందిపేటలో విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రామనగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి



సాలంపాడ్ క్యాంప్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ చీల శంకర్

- ఏఎంసీ చైర్మన్ చీల శంకర్



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ రైతులు

బోధన్: పంటల సాగుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక దిగుబడులు సాధించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్ రైతులకు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో గురువారం సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో రైతులకు పంటల సాగుకు సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పంటల సాగుకు అవసరం మేరకు రసాయనిక ఎరువులు వినియోగించి నేల ఆరోగ్యం కాపాడుకోవాలని, పంట మార్పిడి విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ రక్షణ అంశాలను శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రీజనల్ మేనేజర్ రఘు మాట్లాడుతూ.. పచ్చి రొట్టె పంటలకు సంబంధించిన విత్తనాలు ప్రతి మండలంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్వేత విత్తనాలు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్త స్వప్న మాట్లాడుతూ వానాకాలం సీజన్‌కు అనువైన వరి, సోయా, మొక్కజొన్న విత్తనాల వివరాలను తెలిపారు. సొసైటీ చైర్మన్ గుణపాటి బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల సూచనలు పాటించి పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్ బీవీ రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఆవుల బాలకృష్ణారెడ్డి, ఏడీఏ అలీం అహ్మద్, పశుసంవర్ధక శాఖ వైద్యుడు సురేష్, శాస్త్రవేత్త సాయి చరణ్, ఏఈవో నారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు యాద్గార్‌పూర్‌కు వ్యవసాయ శాస్త్రవేత్తలు

రుద్రూర్: కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏవో టి. రాజు తెలిపారు. కార్యక్రమానికి రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జి.రాకేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు సమ్రీన్, టీవీఎస్ పద్మావతి హాజరవుతారని పేర్కొన్నారు.

ఆగని చెట్ల నరికివేత

- కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది
- నిత్యం ఏదో ఒక చోట నరుకుతున్న వైనం

బాల్కొండ: ఉపాధి హామీ పథకంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ తీగలకు సమస్యగా మారుతున్నాయంటూ నరుకుతున్నారు. ముప్కాల్ మండల కేంద్రం కొత్తపల్లి వరకు గల రోడ్డు వెంబడి నూతన విద్యుత్ లైన్ వేయడంతో ఉన్న చెట్లను పూర్తిగా నరికి వేశారు. రెంజర్లలో కరెంట్ తీగలకు తాకుతున్నాయంటూ చెట్లను నరికి వేశారు. నరికి చెట్లను రోడ్డుపై అలానే వదిలేశారు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. మొక్కలు నాటి చెట్లు పెంచుడు నరుకుడు కోసమేనా అంటూ వన ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల ఆవరణలో..

ముప్కాల్ మండల కేంద్రంలో హరిజనవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నరికి వేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కువ మొత్తంలో టేకు, వేప చెట్లను పెంచారు. ఈ ప్రాంతంలో ఎమ్మార్సీ కార్యాలయ భవనం నిర్మిస్తామంటూ చెట్లను నరికి వేశారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట కారణాలు చూపుతూ చెట్లను నరికి వేస్తున్నారు. నరికిన చెట్లకు బదులుగా మొక్కలు నాటడమే మరిచిపోయారు. దీంతో ఏళ్లుగా పెంచిన చెట్లు కనుమరుగు అవుతున్నాయి.



ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలలో నరికిన చెట్లు.. ట్రాక్టర్‌లో తరలింపు



రెంజర్లలో నరికి రోడ్డుపై పడేసిన చెట్లు

నేడు రాంపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

డిచ్‌పల్లి: రాంపూర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు రాంపూర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు గురువారం తెలిపారు.వీడీసీ సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని,విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు సందీప్, దాసు, శ్రీకాంత్, శ్రీను పేర్కొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్-11.05 -శుభం-1.50- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-4.30
హిట్-7.00 -డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్-10.15
స్క్రీన్-4 ఫైనల్‌డెస్టినేషన్‌బ్లడ్‌లైన్స్-4.30,11.45,10.35
డెవిల్స్‌డబుల్‌నెక్స్ట్‌లెవెల్-2.15-సింగిల్-5.05,7.50

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	87,875		

– నిజామాబాద్ బిజినెస్

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



నవీపేటలో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవీపేట: నవీపేట, బినోల, నాగేపూర్ సొసైటీలలో గురువారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. 30 కేజీల జీలుగ విత్తనాల బస్తాను 50 శాతం సబ్సిడీ కింద అందజేస్తున్నట్లు ఏవో నవీన్‌కుమార్ తెలిపారు.నవీపేట, బినోల, నాగేపూర్ సొసైటీల చైర్మన్‌లు అబ్బన్న, హన్మాండ్లు, శైలేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్, వేల్పూర్ పరిధిలో నేడు పంపిణీ

వేల్పూర్/రుద్రూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ సొసైటీలో, పొతంగల్ సొసైటీలో శుక్రవారం 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారులు శృతి, నిశితలు గురువారం తెలిపారు. సబ్సిడీపై 30 కేజీల బస్తా రూ.2137.5 లకు లభిస్తుందని చెప్పారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

గాండ్ల సంఘం అభివృద్ధికి కృషి

సుభాష్‌నగర్: నగరంలోని గాండ్ల పట్టణ సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. గురువారం నగరంలోని సిర్నాపల్లిగడిలో గాండ్ల పట్టణ సంఘం రెండో అంతస్తును నుడా చైర్మన్ కేశ వేణు, సంఘం పెద్దమనుషులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందూరు గాండ్ల పట్టణ సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని, సభ్యులు ఐకమత్యంతో ఎదగడం అభినందనీయమన్నారు. రెండో అంతస్తుకు ఎస్‌డీఎఫ్ కింద రూ.5లక్షలు మంజూరు చేశానని, రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాదిన్నర కావస్తున్నా.. ప్రభుత్వం కనీసం ఎమ్మెల్యే నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నానని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అర్బన్ నియోజకవర్గంపై ప్రత్యేక చొరవ తీసుకుని స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.